# సాక్షి నారాయణపేట

శనివారం : 6 : మే : 2023






## వేసవి శిబిరాలతో ఉత్సాహం

ప్రభుత్వ వేసవి క్రీడా శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా గడుపుతున్నారు.

వివరాలు 8లో ▸



## మార్మోగిన నామస్మరణ

బీచుపల్లి ఆంజనేయస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /25.0

## వాతావరణం

గాలిలో తేమ శాతం అధికంగా ఉండడంతో చల్లగా ఉంటుంది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షం పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఉపాధి కూలీ పెంచాలి



నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు గిట్టుబాటు అయ్యేలా వేతనాలు పెంచాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు హజిమలాంగ్, వెంకట్రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బండగొండలో కొనసాగుతున్న ఉపాధి పనులను వారు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, కొలతల రేట్లు పెంచి మూడురోజులకు రూ.600 కూలీ వచ్చేట్లు మార్పు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేసి మేటీలకు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్, సేఫ్టీకిట్, పనిసామగ్రి, కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అంజి, రవి, కూలీలు పాల్గొన్నారు.

### ‘అన్యాక్రాంతమైన భూముల్ని కాపాడుతాం’

కోస్గి: నియోజకవర్గ పరిధిలోని వక్ఫ్, దేవాదాయశాఖ, ప్రభుత్వ పరిధిలోని ఏ భూములైనా అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి శుక్రవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్‌బోర్డు భూముల అక్రమాలపై ‘సాక్షి’లో వస్తున్న వరుస కథనాలు, ముస్లిం మైనార్టీల రాస్తారోకో నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి వాస్తవంగా వక్ఫ్ భూములు అన్యాక్రాంతమైనట్లు తేలితే వెంటనే సంబంధిత భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని ఆర్డీఓ, కలెక్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని.. భూముల్ని కాపాడటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతన్నారు. ముస్లిం మైనార్టీలు ఎలాంటి అపోహలకు గురికావద్దని.. ప్రభుత్వ పరంగా వక్ఫ్ భూముల్ని కాపాడుతామని వివరించారు.

### సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ



కృష్ణా: కర్ణాటక సరిహద్దులో ఇటీవల రెవెన్యూ, పోలీస్‌శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అదనపు ఎస్పీ (డీఏఆర్) నాగేంద్రుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున మద్యం, చీరలు తదితరాల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే వాహన తనిఖీలు చేపట్టడంతో పాటు వాటి నంబర్లను రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వర్తించే పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో ఉన్న వారికి భోజనం, తాగునీటిని అందించాలని ఎస్‌ఐ విజయభాస్కర్‌కు సూచించారు.

### జేపీఎస్‌ల వినూత్న నిరసన



నారాయణపేట రూరల్: నియోజకవర్గంలోని జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ ఆడి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. జీపీల్లో వారు నిర్వహించిన విధులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్లకార్డులను చేతబట్టి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. పూలతో పేర్చిన బతుకమ్మను మధ్యలో ఉంచి బొడ్డెమ్మ ఆడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, శ్రీనివాస్, నవిత, జ్యోతి, బబిత, చాణక్య, కనకప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్

# కరువు నేలలో కొలువుల కోట

**దివిటిపల్లిలో ఐటీ టవర్ పనులు పూర్తి**

- నేడు ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్
- అమరరాజా గిగా కారిడార్‌కు శంకుస్థాపన
- నాలుగేళ్లలో 40 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు
- మినీ శిల్పారామం, శిల్పారామం, ఐలాండ్ సుందరీకరణ పనులు సైతం ప్రారంభం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు అనగానే గుర్తుకొచ్చేది కరువు, వలసలకు కేరాఫ్‌గా నిలిచిన ప్రాంతం. ఇది ఒకప్పటి మాట.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ, మహానగరాలకు దీటుగా రూపురేఖలు మార్చుకుంటోంది. తాజాగా కరువునేలలో కొలువుల కోటకు అడుగులు పడ్డాయి. ఐటీ, మల్టీపర్పస్ **ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా రూ.40 కోట్ల వ్యయంతో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో చేపట్టిన ఐటీ టవర్ నిర్మాణం పూర్తి కాగా, ప్రారంభానికి రంగం సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, ఎక్సైజ్, పర్యాటక, క్రీడలశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శనివారం ప్రారంభించనున్నారు. నాలుగేళ్లలో 40 వేల** ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు ముందుకుపడడంతో జిల్లా యువతలో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి.

**కార్యక్రమ వివరాలు..**

ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శనివారం ఉదయం 11 గంటలకు దివిటిపల్లి వద్ద ఉన్న ఐటీ టవర్‌ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి పాత ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకొని, అక్కడ జంక్షన్‌ను ప్రారంభించారు. పక్కనే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బహిరంగసభలో పాల్గొననున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత వన్ టౌన్ జంక్షన్, ట్యాంక్‌బండ్ వద్ద మినీ శిల్పారామం, ఐలాండ్ సుందరీకరణ పనులు, అక్కడి నుంచి కేసీఆర్ అర్బన్ ఎకో పార్కుకు చేరుకొని సఫారీని ప్రారంభిస్తారు.

### తెలంగాణలోనే మొట్టమొదటిది..

తెలంగాణలో మొదటిసారిగా లిథియం గీగా సెల్ బ్యాటరీ ప్యాక్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 270 ఎకరాలు కేటాయించింది. అమరరాజా గ్రూప్స్ సంస్థ ఈ పరిశ్రమను రూ.10వేల కోట్లతో ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు ఎనిమిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. గత డిసెంబరులోనే ఈ సంస్థను గీగా సెల్ బ్యాటరీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కంపెనీ ద్వారా ఎలక్ట్రికల్ వాహనాలకు వాడే బ్యాటరీలను పర్యావరణ సహితంగా తయారు చేయనున్నారు. **శనివారం జరిగే భూమి పూజకు మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నారు.**

### “ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



**గత ప్రభుత్వాలు పాలమూరును నిర్లక్ష్యం** చేశాయి. ఇక్కడి యువతను పట్టించుకోలేదు. డిగ్రీలు, పీజీలు చదివినా ఉద్యోగాలు రాక పట్నం పోయి బతికేటోళ్లు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. తెలంగాణ వచ్చాక ఉపాధి అవకాశాలు పెరిగాయి. పాలమూరులో ఐటీ పార్క్, ఇండస్ట్రియల్ కారిడార్‌లో 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. స్థానిక యువతకు స్థానికంగానే ఉన్నత ప్రమాణాలతో జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. పాలమూరు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు శ్రమిస్తూనే ఉంటా.

– వి.శ్రీనివాస్‌గౌడ్, పర్యాటక, ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి

### ఐదు ఎకరాల్లో ఐటీ టవర్

దివిటిపల్లిలో ఐటీ, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2018లో 371 ఎకరాలకు సేకరించారు. ఇందులో ఐటీ టవర్ కోసం ఐదు ఎకరాలు కేటాయించగా, రూ.40 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్తుల భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడికి దాదాపు వంద ఐటీ కంపెనీలు వచ్చే అవకాశం ఉండగా, 2018లోనే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశ్రమలను ఆహ్వానించేందుకు విదేశాలకు వెళ్లి వచ్చారు. అప్పట్లోనే ఇక్కడి ఐటీ పార్క్‌లో కంపెనీలు ఏర్పాటు చేయాలని 18 కంపెనీ ప్రతినిధులతో మంత్రి చర్చలు జరపగా, వారు అంగీకారం తెలిపారు.

■ స్థానిక యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఐటీ టవర్‌లో ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారికి సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించిన వివిధ రకాల కోర్సులపై అవగాహన కల్పించడంతో పాటు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా ఇక్కడే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న మార్పులు, కొత్త కోర్సులు అంశాలపై చర్చించేందుకు ఆయా కంపెనీల కోసం కాన్ఫరెన్స్‌హాల్‌ను సైతం ఏర్పాటు చేశారు. ..

# సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా మారుద్దాం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

**కలెక్టర్ శ్రీహర్ష**

**నారాయణపేట రూరల్:** సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా మార్చేందుకు వైద్యసిబ్బంది తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఎంఎల్‌హెచ్‌పీలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోగుల వివరాలను నమోదు చేయడంతో పాటు ఆస్పత్రిలో మందుల వివరాలను తెలుసుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు హిమోగ్లోబిన్ టెస్ట్ చేసి కేసీఆర్ కిట్ వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. 102 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్‌బీఎస్‌కే ద్వారా రోజుకు 150 మంది చిన్నారులను పరీక్షించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకొనేలా అవగాహన కల్పించడంతో పాటు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామ హెల్త్ ప్రొఫైల్ అందుబాటులో ఉండాలని, రక్తపోటు, మధుమేహం తదితర జబ్బులకు సంబంధించిన వివరాలు సేకరించాలన్నారు. హెల్త్, న్యూట్రీషన్ కమిటీ సమావేశాలు క్రమంగా నిర్వహించడంతో పాటు ఆస్పత్రుల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో డా. శైలజ, డా. సౌభాగ్యలక్ష్మి, బిక్షపతి పాల్గొన్నారు.

**స్వయం ఉపాధిని ప్రోత్సహించాలి..**


స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష కోరారు. బ్యాంకర్ల జిల్లాస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు రుణాలు ఇవ్వాలన్నారు. పీఎం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి 196 దరఖాస్తులు రాగా.. 34 గ్రౌండింగ్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న 33 ఏటీఎంకు మరో రెండు పెంచాలని, నారాయణపేట, మద్దూర్, కోస్గి, మరికల్‌లో రీ లొకేషన్ చేయాలన్నారు. జిల్లాలో రుణాలు అందించిన, చెల్లించిన వారి వివరాలు వెల్లడించారు. నాబార్డ్ డీడీఎం షణ్ముకాచారి, విభవ్యాస్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

### సీఎంఆర్ వేగవంతం..

జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో బకాయి ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే అప్పగించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా మిల్లర్స్‌తో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యాన్ని త్వరగా మరాడించి గడువులోగా ఎఫ్‌సీఐలకు సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్, మేనేజర్ హతిరాం, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ రాణించాలి

**నారాయణపేట రూరల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీవైఎస్‌ఓ కృష్ణమాచారి కోరారు. క్రీడలపై ఉన్న అభిమానంతో విశ్రాంత ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి క్రీడా కార్యాలయానికి 20 కుర్చీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ.. వెనుకబడిన జిల్లాలో క్రీడాకారులను తయారుచేసి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఆడేలా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ప్రోత్సాహం లేక క్రీడాకారులు వెనుకబడుతున్నారని.. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారంతో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం సుదర్శన్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. అదేవిధంగా మినీ స్టేడియం గ్రౌండ్‌లో వారియర్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి రెండు వాలీబాల్ కిట్లను ఉచితంగా అందించారు. ఆయా కార్యక్రమాల్లో పీఈటీలు సాయినాథ్, బాలరాజు, అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్లను అందిస్తున్న డీవైఎస్‌ఓ కృష్ణమాచారి

## వేసవి శిబిరాలతో నైపుణ్యాభివృద్ధి



సామగ్రితో చిన్నారులు, డీఈఓ లియాకత్ అలీ, ఉపాధ్యాయులు

**నారాయణపేట రూరల్:** తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచితంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలతో పిల్లల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుందని డీఈఓ లియాకత్ అలీ అన్నారు. శుక్రవారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లోని శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి పిల్లలకు నేర్పిస్తున్న అంశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవిలో సమయాన్ని వృథా చేసుకోకుండా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదిరోజుల పాటు కొనసాగే శిబిరంలో గణితంలోని మెళకువలు, స్వాతంత్ర సమరయోధుల పరిచయం, చిత్రలేఖనం, ధ్యానం, చేతిరాత తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని పెంపొందించుకోవాలని, వివిధ రకాల సాంస్కృతిక అంశాలు, క్రీడలను నేర్చుకోవాలని కోరారు. సమావేశంలో తపస్ ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి కిశోర్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, శ్రీనాథ్, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

**బుద్ధుడి బోధనలు పాటిద్దాం**

**నారాయణపేట రూరల్:** గౌతమ బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని డీఈఓ లియాకత్‌అలీ అన్నారు. బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని బాలకేంద్రం ఆవరణలో బుద్ధుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం గడపాలని, హింసాత్మక మార్గాన్ని వీడాలని సూచించారు. యువత ప్రేమ, దయాగుణానికి నిర్వచనంగా మారాలని కోరారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, జ్ఞానామృత పాల్గొన్నారు.

# ‘పాలమూరు’ పరుగులు పెట్టేనా?

## సీఎం కేసీఆర్ సమీక్షతో తాగునీటిపై చిగురిస్తున్న ఆశలు



పూర్తయిన హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం పనులు

- ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశం
- 7.15 టీఎంసీల తాగునీటికి మాత్రమే సుప్రీంకోర్టు అనుమతి
- రెండో దశ కాల్వ పనులపై సందిగ్ధం
- కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ మిగులు పనులకు సైతం చర్యలు

**అచ్చంపేట/ కొల్లాపూర్: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మొదటిదశలో చేపట్టిన తాగునీటికి సంబంధించి ఆగస్టులోగా నీరు అంది**స్తామని సీఎం కేసీఆర్ ప్రకటనతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ పథకం పనులకు ఆది నుంచి ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నాయి. మొదట నార్లాపూర్ రిజర్వాయర్ పనులకు సంబంధించి అటవీ శాఖ క్లియర్స్ లేదంటూ కొందరూ హైకోర్టును ఆశ్రయించారు. తర్వాత భూ సేకరణ, పరిహారం విషయంలో అధికారులకు తలనొప్పులు తప్పలేదు. పర్యావరణ అనుమతులు లేకుండా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారని ఏపీ ప్రభుత్వంతోపాటు ఆ రాష్ట్రంలోని తొమ్మిదిమంది వ్యక్తులు చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) దక్షిణ జోన్‌లో పిటిషన్ వేశారు. దీనిపై ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వం రూ.920.85 కోట్ల పర్యావరణ పరిహారం, జరిమానాను మూడు నెలల్లో కృష్ణానది యాజమాన్య బోర్డుకు చెల్లించాలని 2022 డిసెంబర్ 22న తీర్పు వెల్లడించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాగునీటి అవసరాల కోసం చేపట్టిన 7.15 టీఎంసీల ప్రాజెక్టు పనులను కొనసాగించడానికి ఈ ఏడాది ఫిబ్రవరి 18న తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. పనుల పురోగతిపై సోమవారం సీఎం కేసీఆర్ నూతన సచివాలయంలో తొలి సమీక్ష నిర్వహించి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 55 శాతం పనులు పూర్తి చేసిన ప్రభుత్వం తాగునీటి వినియోగం, పారిశ్రామిక అవసరాలు, నీటి పంపుహౌస్‌లు, లిఫ్టింగ్, అప్రోచ్ చానెల్స్, ఓపెన్ కెనాల్స్, సొరంగాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, కన్వేయర్ సిస్టం పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ మిగులు పనులను సైతం జూన్‌లోగా పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

**1,226 గ్రామాలకు మేలు**

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నిల్వ ఉండే రేగుమాన్‌గడ్డ మిగులు జలాల నుంచి వరదల సమయంలో రెండు టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా ఈ పథకాన్ని రూపొందించారు. రూ.52,056 కోట్ల అంచనా వ్యయంతో ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని 70 మండలాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, పరిశ్రమలు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించాలి. ప్రస్తుతం ప్రధానమైన అప్రోచ్ చానల్, సొరంగం, సర్జ్‌పూల్, పంప్‌హౌస్, రిజర్వాయర్, ప్రధాన కాల్వ పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టును తాగు, సాగునీటితోపాటు పరిశ్రమల అవసరాల కోసం మూడు ప్యాకేజీలుగా విభజించి పనులు చేస్తున్నారు. మొత్తం 18 ప్యాకేజీల ద్వారా 5 లిఫ్టులతో 6 పెద్ద రిజర్వాయర్లు నింపి నీరందిస్తారు.

**నిధుల కేటాయింపు ఇలా.. (రూ.కోట్లలో)**

| ఆర్థిక సంవత్సరం | నిధులు |
|---|---|
| 2016- 17 | 7,000.00 |
| 2017- 18 | 4,007.64 |
| 2018- 19 | 3,035.00 |
| 2019- 20 | 3,025.00 |
| 2020- 21 | 368.58 |
| 2021- 22 | 960.00 |
| 2022- 23 | 1,400.00 |
| 2023- 24 | 1,187.64 |

### పూర్తి చేయాల్సినవి..

పాలమూరు– రంగారెడ్డి పనుల్లో భాగంగా నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్, లక్ష్మీదేవిపల్లిలో మొత్తం 67.97 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. ఇందులో లక్ష్మీదేవిపల్లి మినహా మిగతా రిజర్వాయర్లకు టెండర్లు పూర్తయి పనులు సైతం ప్రారంభమయ్యాయి. జూలైకి కర్వెన, ఆగస్టుకు ఉదండాపూర్ రిజర్వాయర్‌కు నీళ్లు తరలించాలని సీఎం ఆదేశించారు. దీంతో నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల మిగులు పనులు వేగవంతం కానున్నాయి. తాగునీటికి అవసరమైన నీటి లిఫ్టింగ్, నిల్వలకు సంబంధించిన అప్రోచ్ చానెల్స్, ఓపెన్ కెనాల్స్ 50,400 కి.మీ., సొరంగాలు 61,577 కి.మీ., 5 పంపుహౌస్‌ల నిర్మాణాలను అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు పంపుహౌస్‌ల్లో భారీ మోటార్లు ఏర్పాటు చేస్తారు. ఏదులలో 8, వట్టెంలో 9, ఉదండాపూర్‌లో 5 పంపులు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఒక్కోచోట సగం పంపులను ఏర్పాటు చేసేలా పనులు జరుగుతున్నాయి. సాగునీటి కాల్వల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు లేకపోవడం, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయా పనులపై సందిగ్ధం నెలకొంది.

| రిజర్వాయర్లు : 6 (నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్, కేపీ లక్ష్మీదేవిపల్లి) | భూ సేకరణ లక్ష్యం : 26,851.29 ఎకరాలు | సేకరించింది : 23 వేల ఎకరాలు |
|---|---|---|

లబ్ధి పొందనున్న జిల్లాలు : నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ

### రెండు నెలల్లో పూర్తికి చర్యలు



పంప్‌హౌజ్ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం రెండు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోసే పనులు సాగుతున్నాయి. తాగునీటి అవసరాల కోసం 7.2 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అనుమతులు ఉన్నందున ఆ మేరకు పనులు చేపడుతున్నాం. జూన్‌లో పంప్‌హౌజ్ పనులు పూర్తిచేసి, జూలైలో ట్రయల్ రన్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాం. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు వీలుగా కాల్వ పనులు జూలై నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

### ఎన్నికల లోపే ప్రారంభం..



పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనుల ప్రగతి గురించి సీఎం కేసీఆర్ నిత్యం సమీక్షిస్తున్నారు. ఇందులో భాగంగానే పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పలు సాంకేతిక కారణాలతో ఇప్పటికి 2 మోటార్లు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. జూన్ నెలాఖరు వరకు పనులు పూర్తయితే, జూలైలో వాటిని పరీక్షించే పనులు జరుగుతాయి. ట్రయల్‌రన్ సక్సెస్ అయితే వెంటనే ప్రాజెక్టు ప్రారంభిస్తాం. నార్లాపూర్– ఎల్లూరు రిజర్వాయర్ల అనుసంధానంతో తాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో తీరడంతో పాటు కొల్లాపూర్ ప్రజలకు అన్ని రకాలుగా మేలు జరుగుతుంది.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

### నేడు పనులను పరిశీలించనున్న మంత్రులు, అధికారుల బృందం

కొల్లాపూర్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనుల శనివారం రాష్ట్ర మంత్రులు, అధికారుల బృందం పరిశీలించనుంది. వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రాములు, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, ఎత్తిపోతల పథకాల సలహాదారు కే.పెంటారెడ్డి, సీఈ హమీద్‌ఖాన్‌తో పాటు జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట ఎమ్మెల్యేలు ప్రాజెక్టు పనులను సందర్శించి, అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మంత్రులు, అధికారులు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి బయల్దేరుతారు. 9.45 నుంచి 12 గంటల వరకు కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు సమీపంలో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు లిఫ్టు, నార్లాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తారు. పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహిస్తారు. 12.30కు ఏదులకు చేరుకొని అక్కడ రిజర్వాయర్ నిర్మాణ పనులు పరిశీలిస్తారు. 3 గంటలకు వట్టెం రిజర్వాయర్ పనులు పరిశీలించి, 4 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో బాలుడి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో ప్రమాదవశాత్తు షాక్ తగిలి బాలుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని మణికొండకు చెందిన మంగళి చరణ్‌రాజ్(13) శుక్రవారం ఉదయం 10గంటలకు అదే గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న మంగళి యాదయ్య ఇంట్లో ఆడుకోవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్ వైర్ తగలడంతో కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మంగళి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బావిలో జారి పడి..


లక్ష్మయ్య(ఫైల్)

తాడూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన వంకేశ్వర లక్ష్మయ్య(50) గంధంబావికి బట్టలు ఉతకడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడడంతో మృతి చెందాడు. భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రెండు బైకులు ఢీ: వ్యక్తి దుర్మరణం

గట్టు: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో అయిజ మండలం తొత్తినోనిదొడ్డికి చెందిన ఖాదర్ (50) గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తుల, పోలీసుల కథనం మేరకు.. అయిజ మండలం తొత్తినోనిదొడ్డికి ఖాదర్ కుటుంబ సభ్యులతో కలిసి బల్గెరలో బంధువుల వివాహానికి హాజరయ్యారు. అనంతరం భార్య చాంద్‌బీతో కలసి బైక్‌పై చమన్‌ఖాన్‌దొడ్డి మీదుగా సిందనూర్ రోడ్డుపై బయలుదేరాడు. చమన్‌ఖాన్‌దొడ్డికి చెందిన నర్సింహ తన బైక్‌పై ఇందువాసి నుంచి చమన్‌ఖాన్‌దొడ్డి వైపు వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఖాదర్ బైక్‌ను ఢీ కొట్టాడు. గాయ పడ్డ ఖాదర్‌ను హుటాహుటిన అయిజకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

### మరో ప్రమాదంలో..

మక్తల్: బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తిర్మలాపూర్ శివారులో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కట్ట బాలరాజు (35) రోడ్డు వెంట మాగనూర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా తిర్మలాపూర్ శివారులో వెనుక నుంచి బైక్ ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

### పెళ్లి ఇష్టం లేదని యువతి ఆత్మహత్య

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండకు చెందిన శిల్ప (23) పెళ్లి ఇష్టం లేకపోవడంతో అదే గ్రామ శివారులోని కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ షేక్ శంషోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం శిల్పను పెళ్లి చేసుకోవాలని తన తల్లి గుండమ్మ పలుమార్లు కోరింది. తనకు ఇప్పట్లో చేసుకోవడం ఇష్టం లేదని ఆ యువతి బుధవారం ఇంటి నుంచి వెళ్లి ఆ గ్రామంలో ఉన్న కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు కనిపించడం లేదని బంధువుల గ్రామాల్లో విచారించింది. శుక్రవారం గుమ్మకొండ కాల్వలో శిల్ప శవమై కన్పించింది. కుటుంబ సభ్యులకు, పోలీసులకు స్థానికులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### టిప్పర్ బోల్తా

ధరూరు: గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ వద్దకు ఒండ్రు మట్టిని తరలిస్తున్న ట్రిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని కోతులగిద్ద – జాంపల్లి మధ్య రాయచూరు రోడ్డులో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు. గద్వాల మండలం కొండపల్లి వద్ద నుంచి నిత్యం వందలాది ట్రిప్పుల ఒండ్రు మట్టిని ధరూరు మీదుగా తరలిస్తున్న విషయం తెలిసిందే. డ్రైవర్ నిద్రలోకి జారుకోగా.. ఈ సంఘటన అయినట్లు సమాచారం.



# వేసవి శిబిరాలతో ఉత్సాహం


కావేరమ్మపేట పాఠశాలలో నృత్య శిక్షణకు హాజరైన చిన్నారులు

- క్రీడలు, నృత్యం, కరాటే, చేతిరాత, కోలాటాల్లో ఉచిత శిక్షణ
- పలు సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిబిరాలు

జడ్చర్ల టౌన్: వేసవి సెలవుల్లో సరదాలతోపాటు ప్రత్యేక శిక్షణలతో చిన్నారులు ఉత్సాహంగా గడుపుతున్నారు. చదువు కాకుండా తమకు లభించిన సమయాన్ని ఆసక్తి గల వాటిల్లో తర్ఫీదు పొందుతూ మానసిక ఉల్లాసం పొందుతున్నారు. చిన్నారుల ఆసక్తిని గమనించిన కొన్ని సంస్థలు ఉచితంగా మరికొన్ని సంస్థలు నామమాత్రపు ఫీజులతో వేసవి శిబిరాలు ఏర్పాటు చేశాయి. మున్సిపాలిటీ పరిధిలో పదిరోజులుగా శిబిరాలు ప్రారంభమయ్యాయి.

**క్రికెట్, ఫుట్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో**

క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు బాలురుతో పాటు బాలికలు సైతం వస్తున్నారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో బాలబాలికలకు ఉచితంగా ఫుట్‌బాల్ శిక్షణ ఇస్తున్నారు.

**పద్మావతి బాలవికాసం**

పద్మావతి బాలవికాసం పేరుతో పద్మావతి కాలనీ వాసులు పలు అంశాల్లో కాలనీ చిన్నారులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. అక్షర కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహిస్తున్న శిబిరంలో భగవద్గీత పారాయణం, పద్యాలు, శ్లోకాలు, జీవన విధానం-నైతిక విలువలు, కోలాటంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. పిల్లల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసే బెటర్ మైండ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు కొనసాగే శిబిరంలో శారద, రాగసుధ, వజ్రలింగం, రామకృష్ణ, రాజేష్, రఘు, కిరణ్, ప్రవీణ్ ఉచిత శిక్షణను ఇస్తున్నారు.

**కావేరమ్మపేట పాఠశాలలో..**

కావేరమ్మపేట ప్రాథమిక పాఠశాలలో శ్రీసాయి కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో బిందుమాధవి 80మంది చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు మాత్రమే ఈ సదుపాయం కల్పించారు. శిబిరానికి మున్సిపాలిటీతోపాటు సమీప గ్రామాల నుంచి సైతం చిన్నారులు వస్తున్నారు.

**అవోపా ఆధ్వర్యంలో..**

అవోపా ఆధ్వర్యంలో పదో తరగతి చదవబోయే విద్యార్థులకు ఉచిత అవగాహన తరగతులు ప్రారంభించారు. ఫిజిక్స్, గణితం, ఆంగ్లం, బయాలజీ, సైన్స్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తున్నారు. ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిబిరానికి 170మంది వరకు విద్యార్థులు హాజరవుతున్నారని అవోపా అధ్యక్షుడు మురళీ తెలిపారు. పదేళ్లకుపైగా అవోపా ప్రతి వేసవిలో ఈ శిబిరం నిర్వహిస్తూ విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపుతున్నట్లు చెప్పారు.

■ వీటితోపాటు లయన్స్‌క్లబ్‌లో వీఐపీ అశ్వక్ అకామి పేరుతో సయ్యద్ అశ్వక్ కరాటే, నృత్యం, మానసిక వికాసం, చేతిరాత మెరుగుపర్చటం వంటివాటిపై శిక్షణ ఇస్తున్నారు. న్యూ స్కిల్ అకాడమీ పేరుతో తరుణ్ అందమైన చేతిరాతపై అక్షరకాన్సెప్ట్ స్కూల్, ప్రేరణ స్కూల్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కేంద్రాలన్నీ చిన్నారులతో కిటకిటలాడుతున్నాయి. ఇలా వేసవి శిబిరాలతో చిన్నారులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తల్లిదండ్రులు పాటు పడుతున్నారు.

**కూచిపూడి అంటే ఇష్టం**



నాకు కూచిపూడి అంటే ఎంతో ఇష్టం. కావేరమ్మపేట పాఠశాలలో ఉచిత శిబిరానికి నిత్యం వచ్చి నేర్చుకుంటున్నా. ఇప్పటికే రెండు ప్రోగ్రాంలలో పాల్గొన్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు ఇలాంటి శిక్షణ పెడితే బాగుంటది.

– సిరివెన్నెల, 5వ తరగతి, జడ్చర్ల

**క్రికెట్ బాగా ఆడుతా..**



క్రికెట్ అంటే నాకు ఎంతో ఇష్టం. పాఠశాల సమయంలో ఆడేందుకు అంతగా సమయం ఉండదు. అందుకే వేసవి శిబిరానికి వచ్చాను. గతేడాది ఇదే శిబిరంలో క్రికెట్‌లో ఎన్నో మెళకువలు నేర్చుకున్నా. మళ్లీ ఇపుడు శిబిరానికి వచ్చాను. ఈ సారి మరింత నైపుణ్యత సాధించేందుకు ప్రయత్నిస్తున్నాను.

– కేతన్, బాదేపల్లి


క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ


వీఐపీ అకాడమీఆధ్వర్యంలో కరాటే శిక్షణ

# వైభవంగా వసంతోత్సవం


పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయరు దేవస్థానం సమీపంలో రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కనున్న లక్ష్మీనరసింహ (ఓబులేశు) స్వామివారి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అవబృతస్నానం తదితర పూజా కార్యక్రమాలను చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. అనంతరం పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. స్వామివారి పాదాలకు, శఠగోపురంకు పురోహితులు సాంప్రదాయ రీతిలో స్నానాన్ని నిర్వహించారు.

**గరుఢవాహనసేవ..**

ఉత్సవాలలో భాగంగా దేవాలయంలో గరుఢవాహన సేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన గరుఢవాహనంపై లక్ష్మీ నరసింహ స్వామి దేవతామూర్తులను గర్భగుడి నుంచి దేవస్థానం ముందు ఏర్పాటు చేసిన మంటపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. గరుఢవాహనంపై దేవస్థానం పరిసరాల్లో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి విశేషోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


చక్రి (ఫైల్)

మన్ననూర్: శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ పీహెచ్‌సీ ఎదుట రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక జంగాల కాలనీకి చెందిన కరెంట్ నిరంజన్ చిన్న కుమారుడు చక్రి (15) బైక్‌పై మన్ననూర్ బస్టాండ్ నుంచి తన ఇంటి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో శ్రీశైలం నుంచి వస్తున్న కారు అతి వేగంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్స్ సాయంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు అమ్రాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# పోరాటాలతోనే హక్కుల సాధన



ఆత్మకూర్: హక్కుల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా నిరంతరం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, జిల్లా నాయకుడు రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రేచింతలలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు అసంఘటిత కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, నాయకులు రవీందర్, బాలరాజు, కృష్ణయ్య, రఘు, మోదిన్, కార్మికులు పాల్గొన్నారు.

### డీసీఎస్‌ఓ సరెండర్

వనపర్తి: జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సుదర్శన్‌ను ఆ శాఖ కమిషనర్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎంగా విధులు నిర్వర్తిస్తున్న కొండల్‌రావుకు డీసీఎస్‌ఓ అదనపు బాధ్యతలు అప్పగించారు. మే 1వ తేదీ నుంచి అనధికారిక సెలవుపై వెళ్లటం, సీఎంఆర్ విషయంలో అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీస్‌శాఖ ఉన్నతాధికారులతో విచారణ జరిపించనున్నట్లు తెలిసింది. డీసీఎస్‌ఓపై వచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు రుజువైనందున కలెక్టర్ వేటు వేసినట్లు సమాచారం.

# వక్ఫ్ భూములను కాపాడాలని ధర్నా


కోస్గిలో ధర్నా చేస్తున్న ముస్లింలు

కోస్గి: అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ బోర్డు భూములకు ప్రభుత్వం కాపాడాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక శివాజీ చౌరస్తాలో పాలమూరు–తాండూర్ ప్రధాన రహదారిపై ముస్లింలు బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. మండలంలో 250 ఎకరాలకు పైగా వక్ఫ్ భూములు కబ్జాలకు గురయ్యాయన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేసి కబ్జాకు గురైన భూములను గుర్తించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని కూర్చోవడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో అక్కడికి చేరుకుని సమాదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం తహసీల్దార్ మమత ధర్నా స్థలానికి రావడంతో నిరసనకారులు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆమెకు అందజేశారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

# దాడి కేసులో నలుగురికి జైలుశిక్ష

నాగర్‌కర్నూల్: దాడి కేసులో నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పీపీ భవానిబాయి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని తూడుకుర్తికి చెందిన ఎండీ. జబ్బార్‌ను 2020 ఆగస్టు 28న అదే గ్రామానికి చెందిన కరీం, ఇమాముద్దీన్, ఖాజా, రవూఫ్, తాహేర్ పథకం ప్రకారం అదే గ్రామానికి చెందిన ఇమాముద్దీన్ ఇంట్లో కర్రలతో దాడి చేశారు. సొమ్మసిల్లి పడిపోయిన జబ్బార్‌ను చూసి చనిపోయాడన్న ఉద్దేశంతో నలుగురు అక్కడి నుండి పారిపోగా, అదే గ్రామానికి చెందిన గుంత వెంకటయ్య నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అదే రోజు తనని తీవ్రంగా కొట్టిన ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాక్షులను ప్రవేశపెట్టగా నేర నిరూపణ కావడంతో నలుగురికి ఐదేళ్ల శిక్ష, రూ.16 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆమె తెలిపారు.

# పంట మార్పిడితో లాభాలు


చదును చేసిన పంట పొలం

**పాడి-పంట**
**అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్**

అలంపూర్: ఒకే పంటను ఒకే భూమిలో ఏళ్ల తరబడిగా పండిస్తే సమస్యలు ఎదురవుతాయి. చీడపీడల తాకిడి అధికమవుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి ద్వారా ఈ సమస్యను అధికమించవచ్చని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతోపాటు భూమిలో సారం పెరుగుతుందన్నారు. చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలను ఇలా..

**ఇలా చేసుకోవచ్చు..**

యాసంగిలో వేరుశనగ వేసుకునే రైతులు తర్వాత వచ్చే వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. కంది, శనగ పైర్లను వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మొట్ట వరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ పైరుకు నులిపురుగుల బెడద తగ్గుతుంది. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ చిరుధాన్యాపు పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పైర్లు లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు. వంగ తోట వేసిన రైతులు కాలీ ఫ్లవర్‌తో పంట మార్పిడి చేసుకుంటే వంగకు ఎండు తెగులు సోకదు. టమాట, ఆవాలు, బంతి, ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది.

■ దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లి సాగు చేసే వారు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. ఒక సారి పసుపు సాగు చేసిన వారు రెండేళ్లపాటు భూమిలో పసుపు సాగు చేయకూడదు. ఒక వేళ చేస్తే దిగుబడి తగ్గుతాయి. చీడపీడల బెడద పెరుగుతుంది. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజి, పంటల్ని ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

**ఇలా చేయొద్దు**

పంట మార్పిడి చేసే సమయాల్లో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి ఎక్కువగా అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాటా, క్యాబేజి, దోస, గుమ్మడి, సోర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు వేయకూడదు.

**ఎంపికలో జాగ్రత్తలు**

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తు ఉంటాయి. కాబట్టి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దు తిరుగుడు, మొక్క జొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలను గ్రహించే సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పైరుల మీద ఉండే బూడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్య వల్ల ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్ల రేగడి నేలల్లో సోయ చిక్కుడు వేసుకుంటే పైరు కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

### మహిళ మృతదేహం లభ్యం

కోయిల్‌కొండ: మండలంలోని వింజమూర్ శివారులో మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా బండగొండకు చెందిన లక్ష్మి(35)కి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త నర్సింహులు అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతి చెందడంతో ముంబాయికి కూలీ పనికోసం వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటుంది. వారం రోజుల క్రితం బంధువులను చూద్దామని సొంత ఊరికి వచ్చింది. ఈనెల 3వ తేదీన కోస్గిలో తెలిసిన వారిది పెళ్లి ఉందని ఇంట్లో చెప్పి వరుసకు మరిది అయిన కనకప్ప బైక్‌పై నములపల్లిగేటు వరకు వెళ్లింది. అక్కడి నుంచి ఆటోలో కోస్గికి వెళతానని చెప్పింది. దీంతో రాత్రి అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతకగా ఆచూకి లభించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని వింజామూర్ శివారులో మృతదేహాన్ని పశువుల కాపరులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబసభ్యులకు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు చీరతో గొంతు నులిమి హత్య చేసి ఉంటారని మృతురాలి అన్న చింతల్‌కుంట ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

### ఇద్దరు వ్యక్తుల అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని ఆలూరు చెందిన చంద్రయ్య కనిపించకుండా పోయినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. గత నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లిన చంద్రయ్య తిరిగి రాలేదన్నారు. కుమారుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా మండలంలోని నేలబండతండాకు చెందిన ముడావత్ రవి శుక్రవారం ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయాడని కుమారుడు పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### 'మలబార్' షోరూంలో ఆభరణాల ప్రదర్శన



షోరూంలో వెండి ఆభరణాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో శుక్రవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ప్రదర్శన ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ వైష్ణవి ప్రారంభించారు. సంస్థ స్టోర్ హెడ్ శరత్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో భాగంగా ప్రతి రూ.5వేల వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.500 ప్రత్యేక తగ్గింపు ఉంటుందన్నారు. వెండి వస్తువులపై ప్రత్యేకమైన ఆఫర్లను పొందవచ్చన్నారు. వెండి ఆభరణాల ప్రదర్శన ఈనెల 14 వరకు ఉంటుందన్నారు. తమ వినియోగదారులకు 10 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుందన్నారు. ఖచ్చితమైన తయారీ ధర, రాళ్ల బరువు, నికర బరువు, ఆభరణాల రాళ్ల విలువలతో కూడిన పారదర్శక పట్టి, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారానికి 100 శాతం విలువ ఉంటుందన్నారు. మలబార్ గోల్డ్, డైమెండ్స్ అతి వేగంగా పెరుగుతున్న నమ్మకమైన బ్రాండ్ అన్నారు. మలబార్ గ్రూప్ సంబంధించిన మూల్యమైన సంస్థ అని పేర్కొన్నారు. సంస్థ వార్షిక ఆదాయంలో నుంచి అధిక వాటాను ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారిత, పర్యావరణ పరిరక్షణ విభాగాల్లో తమవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

## సీబీఐ కోర్టులో లొంగిపోయిన గంగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ–1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో లొంగిపోయారు. గంగిరెడ్డి బెయిల్ రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. జూన్ 30 వరకు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఆ తర్వాత రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని గంగిరెడ్డికి సూచించింది. వివేకా హత్యకేసులో గంగిరెడ్డిని 2019 మార్చి 28న అరెస్ట్ చేశారు. 90 రోజులు గడిచినా ఆయనపై సిట్ చార్జిషీట్ దాఖలు చేయకపోవడంతో ఆయనకు కడప కోర్టులో డీఫాల్ట్ బెయిల్ వచ్చింది. అప్పటి నుంచి బయటే ఉన్న ఆయన హైకోర్టు ఆదేశాల మేరకు లొంగిపోయారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని జైలుకు తరలించారు.

## వైఎస్సార్‌సీపీలోకి బొమ్మిరెడ్డి

సాక్షి, అమరావతి : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. బొమ్మిరెడ్డితో పాటు ఆత్మకూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టీడీపీ నేత ఇందూరు వెంకటరమణారెడ్డిలు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, వరప్రసాద్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమారెడ్డి ఉన్నారు. టీడీపీలో డబ్బులున్న వారికే పదవులు దక్కుతాయని బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చెప్పారు. సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు.

## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలను విజయవాడలో విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు 6.40 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 6,05,052 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలికలు 2,95,807 మంది..బాలురు 3,09,245 మంది ఉన్నారు. ఫలితాలను https://www.sakshieducation.comలో చూడవచ్చు.

# నర్రెడ్డి సోదరులు చెప్పినట్టే చేశా

## ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- లెటర్, ఫోన్ దాచిపెట్టమని రాజశేఖరరెడ్డి చెప్పారు
- ఆ విషయాలన్నీ ఎవరికీ చెప్పొద్దన్నారు
- నుదుటిపై దెబ్బ, బెడ్ రూమ్.. బాత్‌రూంలో రక్తం ఉందని కూడా చెప్పాను
- వాళ్లవన్నీ ఏమీ పట్టించుకోలేదు.. మేం చూసుకుంటామన్నారు
- ఎర్రగంగిరెడ్డి ఇంట్లోకి వచ్చిన వెంటనే రక్తం వాంతులని చెప్పాడు
- ఈయన సూచన మేరకే పనిమనిషి లక్ష్మి, రాజశేఖర్, ట్యాంకర్ బాషాలు శుభ్రం చేశారు
- నా ఫోన్‌లో సీబీఐ శంకరయ్యతో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడారు
- తాము చెప్పినట్లు వినకపోతే జైలుకెళ్తావని సునీతమ్మ అన్నారు

సాక్షి ప్రతినిధి, కడప : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మృతి చెందాక ఆయన అల్లుడు.. బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, అతని సోదరుడు నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలు చెప్పినట్టే చేశానని వివేకా పీఏ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పెద్దోళ్లు కనుక వారు చెప్పినట్టే చేయాల్సి వచ్చిందన్నారు. 'వారు చెప్పినట్లు చేయకపోతే నువ్వు కూడా జైలుకు వెళ్తావు' అని వివేకా కుమార్తె సునీతమ్మ కూడా చెప్పడంతో వారి సూచనల మేరకు నడుచుకున్నానని ఇటీవల ఆయన ఓ టీవీ చానల్ (ఎన్‌టీవీ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పూసగుచ్చినట్లు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### రోజులాగే ఆ రోజు వెళ్లాను

నేను 30 ఏళ్లకు పైగా వివేకా సార్ వద్ద పని చేస్తున్నాను. ప్రతిరోజు 5.30 గంటలకు సార్ ఇంటికి వెళ్లే అలవాటు. ఆ రోజు కూడా అలాగే వెళ్లాను. ఆయన నిద్ర లేచి ఉంటే హాలులో లైట్ వేస్తారు. వాచ్‌మన్ రంగన్న పడుకొని ఉన్నాడు. సార్ ఇంకా లేవలేదని బయటికి వచ్చి, వీధిదీపం కింద ఐదు నిమిషాలు ఆంధ్రజ్యోతి పేపర్ తిరగేశాను. వివేకా సతీమణి సౌభాగ్యమ్మకు ఫోన్ చేశాను. 'సార్ లేట్‌గా వచ్చి ఉంటాడులే.. కొద్దిసేపు పడుకోని' అని ఆమె సూచించారు. తిరిగి పేపర్



చదువుతుండగా.. వంట మనిషి లక్ష్మి, ఆమె కుమారుడు వచ్చారు. సార్ ఇంకా లేవలేదా? అని అడిగారు. 'రాత్రి లేట్‌గా వచ్చి ఉంటారు.. లేప వద్దని మేడమ్ చెప్పింది' అని చెప్పాను. కొద్దిసేపటి తర్వాత.. సార్ లేవకపోతే లేపాలి కదా.. మళ్లీ ఎందుకు లేపలేదు.. అని అరుస్తారని వంటమనిషి లక్ష్మిని బెడ్‌రూమ్ సైడుకు వెళ్లి పిలవాలని చెప్పాను. లక్ష్మి బెడ్‌రూము వద్దకు వెళ్లి పిలిచి వచ్చే సమయంలో వాచ్‌మన్ రంగన్న లేచి.. బెడ్‌షీట్‌ను సందులో పెట్టి ఉత్తరం వైపు ఉండే గార్డెన్ వైపు వెళ్లిపోయాడు. అంతలోనే వాచ్‌మెన్ రంగన్న పరుగెత్తుకుంటూ వచ్చి సార్ పడిపోయాడని చెప్పాడు. నేను వంటమనిషి కుమారుడు ప్రకాశ్ నార్త్ సైడ్ వాకిలి గుండా లోపలికి పరుగెత్తాము.

### లోపలికి వెళ్లి చూస్తే అంతా రక్తమే

ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బెడ్‌రూం అంతా రక్తం. భయం వేసింది. ఏసీ, లైట్ ఆన్‌లో ఉంది. సార్ మాత్రం బెడ్‌పై లేడు. బాత్‌రూములో పడిపోయి ఉన్నాడు. నాడి పట్టుకుని చూశా. తలపై గాయం కనిపిస్తోంది. నాతోపాటు ఉన్న ప్రకాశ్‌తో మన సార్ మనకు లేడని చెప్పా. బయటికి వచ్చి వివేకా సార్ అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేశాను. 'బావ ఇక మనకు లేడు. ఎవరో ఏదో చేశారు. ఏదో జరిగింది. తలపై గాయం కనిపిస్తోంది. ఇల్లంతా రక్తం ఉంది' అని చెప్పాను. తర్వాత ఆయన సోదరుడు శివప్రకాశ్‌రెడ్డికి కూడా అదే చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి వైఎస్ వివేకా మొబైల్ సోఫాలో కనిపించింది. సైలెంట్‌లో ఉంది. ఏదో ఫోన్ రావడంతో రింగ్ అవుతున్నట్లు గుర్తించి, జేబులో పెట్టుకున్నాను. బెడ్ ముందు ఉన్న వీల్ చైర్ ముందు ఓ పేపరు పడి ఉంది. ప్రకాశ్, నేను దాన్ని ఓపెన్ చేసి చూశాము. అందులో సార్ రాసిన మ్యాటర్ ఉంది. ఆ లెటర్‌లో అక్షరాలు అంత క్లియర్‌గా లేవు. బాగా పరిశీలిస్తే 'డ్రైవర్ ప్రసాద్ నిన్న డ్యూటీకి త్వరగా రమ్మన్నందుకు నన్ను కొట్టి చంపాడు. మీరు డ్రైవర్ ప్రసాద్‌ను వదిలి పెట్టవద్దు' అని రెండుసార్లు రాసి ఉంది. కింద వైఎస్ వివేకా అని ఉంది.

### లెటర్‌ను ఎవరికీ చూపించొద్దన్నారు

ఆ లెటర్ విషయం వెంటనే అల్లుడు రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. 'ఆ లెటర్‌ను జాగ్రత్తగా దాచి పెట్టు.. ఎవరికీ చూపించవద్దు' అన్నాడు. నేను పోలీసులతో ప్రాబ్లమ్ అవుతుంది కదా అని అడిగాను. 'అదంతా నేను వచ్చిన తర్వాత మాట్లాడతా. నీకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. నేను వచ్చాక పోలీసులకు ఇస్తాను. అప్పటి దాకా దాచి పెట్టు' అని చెప్పాడు. ఈ విషయంగా శివప్రకాశ్‌రెడ్డికి కూడా తెలియజేసి.. నాకు దిక్కుతోచడం లేదని చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వచ్చాడు. నేనే ఆయన్ను లోపలికి పిలుచుకుని వెళ్లాను. అవినాశ్‌రెడ్డితోపాటు శివశంకర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి మరి కొంత మంది ఉన్నారు. తర్వాత అవినాశ్‌రెడ్డి సార్ బయటికి వచ్చి లాన్‌లో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆ తర్వాత వైఎస్ అవినాశ్‌రెడ్డి చిన్నాన్న, పెద్దనాన్న, కుటుంబ సభ్యులు ఒకరి తర్వాత ఒకరు అక్కడికి వచ్చారు. నేను రంగన్నను పిలిచి దబాయిస్తే, రాత్రి దోశలు తిని నిద్రయానని చెప్పాడు.

### పోలీసులకు చెప్పేద్దామంటే వినలేదు

గుండెపోటు విషయం ఎవరు ఎలా చెప్పారో తెలియదు. లెటర్, రక్తాన్ని బట్టి వైఎస్ వివేకాను ఎవరో ఏదో చేశారని నేను భావించాను. కొద్దిసేపటికి సీబీఐ శంకరయ్య, ఎర్రగంగిరెడ్డి వచ్చారు. ఎర్ర గంగిరెడ్డి రావడంతోటే బ్లడ్ వామ్‌టింగ్ చేసుకున్నాడని చెప్పాడు. బాత్‌రూములో గోడకు ఆరు, ఏడు అడుగులు రక్తం చిమ్మిందని చెప్పగా.. బేసిన్‌కు తల కొట్టుకుని రక్తం వచ్చి ఉంటుందిలే అన్నాడు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామా అంటే ఏం అవసరం లేదులే అన్నాడు. ఎర్రగంగిరెడ్డి ఇలా చెబుతున్నాడని నేను నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి చెప్పాను. పక్కన సీబీఐ ఉన్నాడని మాట్లాడాలని ఫోన్ సీబీఐకి ఇచ్చాను. వాళ్లిద్దరు మాట్లాడుకున్నారు. రాజశేఖరరెడ్డి స్టేషన్‌లో కంప్లైంట్ రాసివ్వాలని సూచించారు. కొద్దిసేపటికి ఎర్రగంగిరెడ్డి.. కంప్యూటర్ ఆపరేటర్ ఇనాయతుల్లాకు 'లక్ష్మమ్మను రమ్మను.. బక్కెట్‌తో నీళ్లు తీసుకుని ఇదంతా క్లీన్ చేయాలి' అని చెప్పాడు. లక్ష్మమ్మ సగం క్లీన్ చేసి.. కళ్లు తిరుగుతున్నాయని చెప్పి వెళ్లిపోయింది. తర్వాత తన వద్ద పనిచేసే పిల్లలు రాజశేఖర్, ట్యాంకర్ బాషాతో ఇనాయతుల్లా క్లీన్ చేయించారు. సార్ డెడ్‌బాడీ బాత్‌రూము నుంచి తేవడానికి ఎర్రగంగిరెడ్డితో కలిసి నలుగురు వెళ్లారు. తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

### పోలీసులు బాగా కొట్టారు

అవినాశ్‌రెడ్డి ఉదయాన్నే వచ్చి వెళ్లాడు.. మళ్లీ రాలేదు. రక్తం శుభ్రం చేసే సమయంలో ఆయన లేరు. నేను సీబీఐ చెప్పినట్లు కంప్లైంట్ రాసిచ్చి ఆస్పత్రికి వెళ్లాను. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి.. నా భార్యను తీసుకొచ్చి పోస్టుమార్టం రూమ్ వద్ద సార్‌ను చూపించాను. తర్వాత సార్ డెడ్ బాడీని ఇంటి వద్దకు తెచ్చారు. అప్పుడు లెటర్‌ను నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఇచ్చాను. తర్వాత 15 నిమిషాలకు ఆ లెటర్‌ను ఎస్పీకి అందజేశానని, నీకు ఇబ్బంది లేదని రాజశేఖరరెడ్డి చెప్పాడు. సాయంత్రం 4 – 4.30 గంటల ప్రాంతంలో నన్ను పోలీసులు తీసుకువెళ్లి జీఎన్‌టీయూ గెస్ట్‌హౌస్‌లో పెట్టారు. అక్కడి నుంచి నాతోపాటు మరికొందరిని వేముల పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కడప డీటీసీకి తీసుకెళ్లి 13 రోజులు పెట్టుకుని అందరినీ కొట్టారు. తర్వాత నాతోపాటు ప్రకాశ్, ఎర్రగంగిరెడ్డిని ముద్దాయిలుగా చూపిస్తూ రిమాండ్‌కు తరలించారు. మూడు నెలలు జైలులోనే ఉన్నాం. మధ్యమధ్యలో సునీతమ్మ, రాజశేఖరరెడ్డి వచ్చి మాట్లాడిపోయే వారు. మేము బయటికి వచ్చిన కొద్దిరోజుల తర్వాత కేసు సీబీకి బదిలీ చేశారు. తర్వాత సునీత, రాజశేఖరరెడ్డి.. సీబీఐకి సహకరించాలని చెప్పేవారు. అప్పటి నుంచి సీబీఐ అధికారులు ఎప్పుడు పిలిచినా వెళ్లి వచ్చాం.

### సీబీఐ వాళ్లూ కొడతారనుకోలేదు

సీబీఐ వాళ్లు ఢిల్లీకి రావాలని చెప్పారని నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. వెళ్లమని చెప్పి.. టికెట్ ఆయనే తీసిచ్చాడు. వారికి సహకరించాలని సూచించాడు. ఢిల్లీలో వాళ్లు నెల రోజులు పెట్టుకున్నారు. మధ్యలో రాంసింగ్ వచ్చి 'నేను చెప్పినట్లు చెబుతావా? లేదా? వైఎస్ అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలు మిమ్మల్ని మ్యానేజ్ చేశారు. ఆ విషయం మీరు చెప్పడం లేదు. మేము చెప్పినట్లు చెప్పకపోతే జైలుకు పంపుతాం' అని బెదిరిస్తూ కొట్టేవారు. సీబీఐ అధికారులు ఇలా కొడతారని ఊహించలేదు. నెల తర్వాత నన్ను పంపించేశారు. ఆ తర్వాత నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతలు నన్ను హైదరాబాదుకు రమ్మని పిలిచారు. అక్కడికి వెళ్లాక 'నువ్వు రామ్‌సింగ్ సార్ ఎలా చెబితే అలా చేయాలి. లేకపోతే ఇబ్బందుల్లో పడతావు. నువ్వు సహకరిస్తే నిన్ను సేవ్ చేస్తాం. ఇదొక్కటే మార్గం' అని చెప్పారు. మధ్యమధ్యలో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి.. అవినాశ్ మ్యానేజ్ చేశాడని చెప్పమన్నారు.

### అలాగైతే జైలుకెళ్లేది నువ్వేనని భర్తకు సునీత హెచ్చరిక

అవినాశ్ నన్ను మేనేజ్ చేయడం ఏమిటని అప్పుడే గట్టిగా వ్యతిరేకించాను. అప్పుడు సునీత నాపై ఫైర్ అవుతూ 'నువ్వు ఏమనుకుంటున్నావు.. నిన్ను ఎవ్వరూ కాపాడలేరు' అని హెచ్చరించారు. రాజశేఖరరెడ్డి నన్ను సముదాయించేలా భుజం తట్టాడు. నేను ఉన్నది ఉన్నట్లు చెబుతానని తెలియజేశాను. ఆ సమయంలో సునీత.. రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి 'కృష్ణారెడ్డి సహకరించకపోతే నువ్వే జైలుకు వెళతావు' అని చెప్పింది. ఆమె అలా ఎందుకు అనిందో నాకు అర్థం కాలేదు. తర్వాత కొద్ది రోజులకు రాత్రి సమయంలో సీబీఐ అధికారి రాంసింగ్ నా సెల్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. తర్వాత మా అబ్బాయితో ఫోన్ చేయించి (రామ్‌సింగ్‌కు తెలుగు సరిగా రాదు కనుక) మాట్లాడించాను.

### నిజం చెబితే కొడతారేంటి?

'దస్తగిరి, రంగన్నలు మేము చెప్పినట్లు విన్నారు. నువ్వు కూడా చెప్పినట్లు వింటే సేవ్ చేస్తా' అని రామ్‌సింగ్ తెలిపారు. తెల్లవారగానే నీ ఇద్దరు కుమారులతో కలిసి కడపలోని కేంద్ర కారాగార గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచించారు. నేను ఈ విషయం నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పగా, వెళ్లాలని సూచించాడు. హైదరాబాదులోని పిల్లలను పిలిపించి ఉదయం 11 గంటలకు వారితో కలిసి వెళ్లాను. మేము చెప్పినట్లుగా సహకరించాలని కోరారు. ఇందుకు నేను మరోమారు అభ్యంతరం చెబుతూ.. నాకు తెలిసిన విషయాలన్నీ చెబుతానని చెప్పాను. దాంతో ఆయన కట్టె తీసుకుని నన్ను కొట్టాడు. నిజం చెబితే కొడతారా? అంటూ మా పిల్లలు అడ్డుతగిలారు. సాయంత్రం వరకు నన్ను అక్కడే పెట్టుకుని బూతులు తిట్టి పంపారు. మళ్లీ పిలిచినప్పుడు కూడా ఇలాగే మాట్లాడితే నీ కథ ఉంటాదని హెచ్చరించారు.

### చెప్పినట్లు వినలేదని పెళ్లి ఆపించేశారు

అప్పటికి వారం రోజుల్లో నా చిన్న కుమారుడి పెళ్లి. సీబీఐ వాళ్లకు నేను సహకరించలేదని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతకు కోపం వచ్చింది. వారు పెళ్లి కుమార్తె వారికి ఫోన్ చేసి 'కృష్ణారెడ్డి హత్య కేసులో ఉన్నాడు. వైఎస్ అవినాశ్‌రెడ్డికి సహకరించాడు. త్వరలో ఆస్తులు స్వాధీనం చేసుకుంటారు. ఈ పెళ్లి క్యాన్సిల్ చేసుకోండి' అని ఫోన్ చేసి చెప్పారు. నాకు విషయం తెలిసి నేను నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి వద్దకు వెళ్లగా సరైన స్పందన లేదు. పెళ్లి క్యాన్సిల్ అయితే కానీ అని నేను నిజాన్ని నిర్భయంగా చెప్పాలని భావించాను. ఆ తర్వాత నా కుమారుడు అమెరికా వెళ్లాడు. నేను ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతిపత్రం ఇవ్వబోతే ఆయన తీసుకోలేదు. అందుకే పులివెందుల కోర్టులో ప్రైవేటు కంప్‌లైంట్ వేశాను. దాని గురించి ఇప్పటివరకు అతీగతీ లేదు. నా పాస్‌పోర్టు రెన్యువేల్ కాకుండా ఆగిపోయింది. నా ప్రమోషన్, నా కుమారుడి పెళ్లి ఆగిపోయాయి. నేను వివేకాకు సేవ చేసినందుకు ఇస్తామన్న ఐదు ఎకరాల భూమి ఇవ్వలేదు. ఇలా అన్ని విధాలా నాకు అన్యాయం జరిగింది. ఇప్పుడు సీబీఐ కొత్త బృందం వచ్చింది. వారికి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను. వివేకాకు హైదరాబాద్, పులివెందుల, కడపల 200 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఆ ఆస్తులన్నీ దాదాపు కంపెనీ పేరుపైనే ఉండేవి.

## అటవీ పరిరక్షణకు చర్యలు

గండేడ్/ మహమ్మదాబాద్: అటవీ పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి క్షితిజ అన్నారు. శుక్రవారం గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని నర్సరీలను పరిశీలించారు. ముందుగా కొండాపూర్ అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించారు. మొక్కల పెంపకం ఏ విధంగా కొనసాగుతుందని సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని మొక్కలు పెంచుతున్నారు. ఎన్ని రకాల మొక్కలు, సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, వాటి నిర్వహణ ఎలా చేపడుతున్నారు వంటి అంశాల గురించి ఆరాతీశారు. అనంతరం ధర్మాపూర్ అటవీ ప్రాంతంలో పర్యటించారు. అటవీ పరిరక్షణకు పక్కా చర్యలు చేపట్టాలని ఆమె సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట డీఎఫ్ఓ సత్యనారాయణ, ఎఫ్ఆర్ఓ మగ్దూం హుస్సేన్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు తదితరులున్నారు.

## ఫార్మా కంపెనీ వద్దంటూ రిలే నిరాహార దీక్ష



మహమ్మదాబాద్: ఫార్మా కంపెనీ వద్దంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మండలంలోని నంచర్ల మినీ పారిశ్రామిక వాడలో ఫార్మా పెట్టొద్దంటూ చేపట్టిన దీక్ష శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. దేశాయిపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఆయా గ్రామాలకు చెందిన రైతులు, యువకులు ఆందోళన చేస్తున్నారు.

# మార్మోగిన అంజన్న నామస్మరణ


రథోత్సవానికి హాజరైన జనం


నైవేద్యం వండుతున్న భక్తులు

- బీచుపల్లిలో కనులపండువగా స్వామివారి రథోత్సవం
- వైభవంగా సీతారాముల కల్యాణం
- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఎర్రవల్లిచౌరస్తా: ఆంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు బీచుపల్లి పుణ్యక్షేత్రమంతా అంజన్న నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అభయాంజనేయస్వామిని అలంకరించి ఉదయం పంచామృతాభిషేకం, వ్యాసపూజ చేశారు. మధ్యాహ్నం ఆలయంలో సీతారాములకు వేదమంత్రాల నడుమ కల్యాణం వైభవంగా చేశారు. అనంతరం బలిహరణం, సాయంత్రం రథంగ హోమం, రాత్రికి కుంభం పూజలను వైభవంగా నిర్వహించారు. వేల సంఖ్యలో హాజరైన భక్తుల నడుమ రాత్రి రథోత్సవం నిర్వహించారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల, కర్నూల్, అలంపూర్, కొత్తకోట, కొల్లాపూర్, ఆత్మకూర్, రాయచూర్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. దక్షిణవాహినిగా పేరుగాంచిన పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మట్టి కుండల్లో దాసంగాలతో ప్రత్యేక నైవేద్యాలను వండి అభయాంజనేయస్వామికి ప్రసాదంగా సమర్పించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసి పోయింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో మిఠాయిలు, బొమ్మలు, గాజుల దుకాణాలతోపాటు జాయింట్‌వీల్ తదితర ఆటల పరికరాలను ఏర్పాటు చేశారు.


ఆలయంలో రథాంగ హోమం నిర్వహిస్తున్న అర్చకులు


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


భక్తులతో కిక్కిరిసిన కృష్ణానది పుష్కరఘాట్

## వైభవంగా మదనగోపాలస్వామి రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో సురభి రాజవంశస్తులు పరిపాలించిన జటప్రోల్ సంస్థాన ఆలయంలోని మదనగోపాలస్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించి పూర్వ వైభవం గుర్తుకు వచ్చేలా రథోత్సవాన్ని ముందుకు సాగించారు. రథోత్సవం ఎదుట పెద్ద ఎత్తున యువకులు ఆటపాటలు, కోలాటాలు, బొడ్డెమ్మలు వేశారు. ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి, రాజ కుటుంబీకులు ఆదిత్య లక్ష్మణరావు రథోత్సవానికి హాజరుకాగా, వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ఆలయ రథోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్ట్ కట్టకముందు లాగిన ఈ తేరును గ్రామాలు ముంపునకు గురైన తర్వాత మళ్లీ కొత్తగా తేరు తయారు చేయించి లాగటం ఎంతో సంతోకరంగా ఉందన్నారు.


రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

ముమ్ముందు ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని మాటిచ్చారు. అంతకు ముందు గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖాజా, గోవింద్‌గౌడ్, రాజేష్, విజయరామారావు, నూర్‌పాషా, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూరాలకు 4,070 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4,070 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 మీటర్లు కాగా, రాత్రి 7గంటల వరకు 315.940 మీటర్లుగా ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 129 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 25.99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేవని, ప్రాజెక్టు నుంచి దిగువకు 5,393 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.82 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 3,999 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 1,511 క్యూసక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### శ్రీశైలంలో పెరిగిన నీటిమట్టం

దోమలపెంట: ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా నీటి క్యాచ్‌మెంట్ ఏర్పడి 24గంటల వ్యవధిలో శ్రీశైలం జలాశయంలో 3పాయింట్లు నీటిమట్టం పెరిగింది. శుక్రవారం జలాశయంలో నీటిమట్టం 807.3 అడుగులు, 32.7 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిమట్టం


ఎంపీపీలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

## ఎంపీపీలతో మాజీ మంత్రి జూపల్లి భేటీ

వనపర్తి: ఇటీవల బీఆర్ఎస్‌ను వీడిన పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు, పలువురు నాయకులతో శుక్రవారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు భేటీ అయ్యారు. శుక్రవారం స్థానిక తిరుమలహిల్స్‌లోని ఎంపీపీ మేఘారెడ్డి ఇంటికి వచ్చిన మాజీ మంత్రి సుమారు గంటపాటు రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం. మారుతున్న రాజకీయ పరిణామాలకు తమ అడుగు ఎటువైపుకేస్తే.. ప్రజా ఆమోదం లభిస్తుందనే విషయంపై చర్చించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఉన్న కొల్లాపూర్ ప్రాంత వాసుల ఓట్లను దక్కించుకునేందుకు ఎలాంటి వ్యూహాలు రచించాలనే సమాలోచనలు చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అసమ్మతి ప్రజాప్రతినిధులు, నాయకుల, ప్రజల నాడికి అనుగుణంగా వ్యవహరించాల్సిన తీరు, ప్రజల్లో వెళ్లేందుకు రూపొందించాల్సిన ప్రత్యేక కార్యచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరో పదిరోజుల్లో తమ పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించుకుని తర్వాత ఏ పార్టీలో చేరాలనే విషయం నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఈ భేటీలో పెద్దమందడి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సత్యారెడి, కౌన్సిలర్ బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు సతీష్, తిరుపతి రెడ్డి, నరేష్, తిరుపతయ్య యాదవ్, మన్నెంకొండ, శివ యాదవ్ తదితరులు ఉన్నారు.